చక్కటి జీవితానికి రెండు చుక్కలు

- పోలియో మహమ్మారిని పారదోలుదాం
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 0–5 ఏళ్ల లోపు పిల్లలందరికీ చుక్కల మందు అందజేత


నరసింహనగర్ యూపీహెచ్‌సీలో పోలియో డ్రాప్స్ వేస్తున్న 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ


24వ వార్డులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కె.కె.రాజు


80 ఫీట్ రోడ్‌లో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు


46వ వార్డులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

సీతమ్మధార: పోలియో మహమ్మారిని పారదోలుదామని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 24వ వార్డు రేసపువానిపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పిల్లల నిండు నూరేళ్ల జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయాలన్నారు. 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని, అశ్రద్ధ చేయరాదని సూచించారు. ఆరోగ్య శాఖ అధికారులు ఎక్కువగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, వైద్యాధికారి మన్‌మోహన్, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా పల్స్ పోలియో

సీతంపేట: నియోజకవర్గంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం చురుగ్గా జరిగింది. 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని విద్యుత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 43వ వార్డు నరసింహనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో ఏర్పాటు చేసిన మొత్తం 26 బూత్‌ల్లో వైద్య సిబ్బంది 0 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు తాగించారు. 80 ఫీట్ రోడ్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు.. నరసింహనగర్ యూపీహెచ్‌సీలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ.. సీతంపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, మధురానగర్ హైస్కూల్, గణేష్‌నగర్ సచివాలయాల్లో 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాణాల తరుణ్ కుమార్, పి.గోపి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పిల్లలకు ఆరోగ్యకర జీవితం

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు శాంతినగర్, కైలాసపురం, మధుసూదన్‌నగర్, కస్తూరినగర్ సచివాలయాల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. ప్రతి ఒక్క చిన్నారికి రెండు చుక్కలు వేయడంతో ఆరోగ్య జీవితానికి నాందిగా నిలుస్తామన్నారు. వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

42, 55 వార్డుల్లో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ ప్రైమరీ స్కూల్‌లో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు చుక్కల మందు వేశారు.

◆ 55వ వార్డు సాక్షి గణపతి ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమం ప్రారంభించారు.

◆ గవర తాటిచెట్లపాలెం సంతోషిమాత గుడి వద్ద చిన్నారులకు వైఎస్సార్‌సీపీ విశాఖ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొడ్డేటి గంగామహేష్ చుక్కల మందు వేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ వార్డు నాయకులు దుప్పలపూడి శ్రీనివాస్, ద్వారం సంతోష్‌కుమార్, ఆర్పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

49, 50, 51, 53 వార్డుల్లో..

మర్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డు సూర్యానగర్–1 అంగన్‌వాడీ కేంద్రం, ఏఎస్సార్ నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో పోలియో కేంద్రాలను డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సూచనల మేరకు పోలియో కేంద్రాలను సందర్శిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో డైరెక్టర్లు ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్, డాక్టర్ కె.పి.నాయుడు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

◆ 50వ వార్డు మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ 4, 5 తేదీల్లో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి 0 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్, ఏఎన్ఎంలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 50వ వార్డు నాయకులు బగాది విజయ్, పప్పల సునీత, ఎం.లక్ష్మి, పొన్నాడ అప్పారావు మాస్టారు, ఏవీఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ 287 సచివాలయం, మాధవధార వుడా కమ్యూనిటీ హాల్, మాధవస్వామి కల్యాణ మండపంల్లో చిన్నారులకు పోలియో చుక్కలను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ వేశారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

◆ 53వ వార్డు మర్రిపాలెం శివనగర్ యూపీహెచ్‌సీలో వైద్యాధికారి, సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


చిన్నారికి పోలియో డ్రాప్స్ వేస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతమ్మధార: పిల్లల ఆరోగ్య పరిరక్షణకు పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రులందరి బాధ్యతని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ అన్నారు. రేసపువానిపాలెం యూపీహెచ్‌సీలో ఆయన తన సతీమణి డాక్టర్ పృథ్వీతో కలిసి వారి కుమార్తెతోపాటు పలువురు చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పల్స్ పోలియో డే సందర్భంగా బాధ్యతగా తన కుమార్తెకు పోలియో డ్రాప్స్ వేయించినట్లు తెలిపారు. పోలియో బారిన పడకుండా తల్లిదండ్రులు ఐదేళ్లలోపు తమ పిల్లలకు తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని సూచించారు. పల్స్ పోలియో కోసం నగరంలో 885 ఆరోగ్య కేంద్రాలు, పోలియో బూత్‌లు ఏర్పాటు చేయగా.. 3,252 మంది వలంటీర్లు సేవలందించారని చెప్పారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎన్‌యూహెచ్ఎం కో–ఆర్డినేటర్ శోభాభూషన్ పాల్గొన్నారు.


49వ వార్డులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు


50వ వార్డులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్


51వ వార్డులో చిన్నారికి పోలియో డ్రాప్స్ వేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


సాక్షి గణపతి ఆలయ వద్ద పాపకు పోలియో చుక్కలు వేస్తున్న ఆళ్ల శివగణేష్


మధురానగర్ హైస్కూల్‌లో పోలియో డ్రాప్స్ వేస్తున్న 25వ వార్డు కార్పొరేటర్ గోవింద్

క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సీతమ్మధార: ద్వారకా, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారకా సీఐ రమేష్ మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేయవద్దన్నారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్దకు పోలీసులు అప్పగించారు. ఎస్ఐలు శ్రీను, ధర్మేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వనితా వాకర్స్ క్లబ్‌లో మహిళా దినోత్సవం


విజేతలకు బహుమతులు అందిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్స్ వనితా వాకర్స్ క్లబ్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఎంతో ప్రాధాన్యమిస్తూ సంక్షేమ పథకాలు ప్రతి మహిళా పొందేందుకు ఎంతోకృషి చేస్తున్నారన్నారు. పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వాకర్స్ క్లబ్ మహిళలకు కె.కె.రాజు నూతన వస్త్రాలు అందించారు. పలువురు ప్రముఖ మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చల్లా రజిని, ముర్రు వాణి, ఇండస్ట్రియల్ డైరెక్టర్ కాయిత వెంకటలక్ష్మి, త్రీ స్టార్స్ వనితా వాకర్స్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


మెడికవర్ ఆస్పత్రిలో లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న రవికుమార్

మర్రిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ను ఆస్పత్రిలో ఉన్న రోగికి నేరుగా అందజేశారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో 49వ వార్డు పింఛన్‌దారుడు పి.సత్యనారాయణ మూర్తి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసి మానవతా దృక్పథంతో ఆదివారం కార్పొరేటర్ అల్లు శంకరరావు సూచనల మేరకు 285 సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ జానకీరామ్, కన్వీనర్ ఎస్.రవికుమార్, వలంటీర్ రాధ కలిసి లబ్ధిదారుడికి రూ.3 వేలు పెన్షన్ నగదును ఆస్పత్రికి వెళ్లి అందజేశారు.

భయపెడుతున్న శునకాలు


సింహగిరి కాలనీలో వీధికుక్కల గుంపు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం, సత్యసాయి నగర్ కొండవాలు ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. అధిక సంఖ్యలో శునకాలు రోడ్ల పైనే ఉంటూ పగలూ, రాత్రి కూడా రాకపోకలు సాగించేవారిపై భౌతిక దాడులు చేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో పార్క్‌చేసి ఉంచిన వాహనాలపై వీటి ప్రతాపం చూపిస్తున్నాయి. ఆటో సీట్లు, బైక్ సీట్లు కొరికి చింపేస్తున్నాయి. వారం వ్యవధిలోనే సింహగిరి కాలనీ వాసులను ఇద్దరిని కుక్కలు కరచినట్లు, ఇటీవల కాలంలో సుమారు 10 మంది కుక్కకాటుకు గురైనట్లు స్థానికులు తెలియజేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీతంపేటలో మెగా వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో ఆదివారం 25వ వార్డు సీతంపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గైనకాలజీ వైద్యులు ఎస్.గౌతం, లుథియా, మెర్సీ, పీడియాట్రిక్స్ డాక్టర్ రమేష్‌కృష్ణ, జనరల్ మెడిసన్ డాక్టర్ సప్నా నరేష్, దంత వైద్యులు డాక్టర్ గంగాధర్, అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది స్థానికులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి రవికిరణ్ ప్రసాద్, వ్యవస్థాపక అధ్యక్షుడు మొదిలి మహేష్, పూర్వ అధ్యక్షుడు వైవీవీ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, సచివాలయ కన్వీనర్ సారిపిల్లి సంతోష్, రాము, ఈశ్వరరావు, సునీత, లావణ్య, రాములు, క్లబ్ డైరెక్టర్ గంగాధర్, ఎ.కిరణ్‌కుమార్, శ్రీనివాస్, సత్యశ్రీవల్లిక, ఎంవీఎస్ పద్మజ, కావ్య, నాగిరెడ్డి, రాజేష్, డాక్టర్ రాజు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు పరికరాల పంపిణీకి రిజిస్ట్రేషన్


రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వయోవృద్ధులతో మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం ఆలిమ్‌కో సంస్థ ద్వారా ప్రవేశపెట్టిన వయోశ్రీ యోజన పథకంలో వయోవృద్ధులకు పలు పరికరాల పంపిణీ కోసం ఆదివారం కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ నమోదు కార్యక్రమాన్ని ముఖ్య అతిథి రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ప్రారంభించి మాట్లాడారు. వయోశ్రీ పథకం ద్వారా రూ.12 వేల విలువైన ఉపకరణాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. 60 ఏళ్లు నిండి, తెల్లరేషన్ కార్డు కలిగిన దివ్యాంగ వృద్ధులకు కళ్లజోళ్లు, వీల్‌చెయిర్‌లు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, మోకాళ్ల బెల్టులు, నడుము బెల్టులు, మరిన్ని ఉపకరణాలను అందిస్తారన్నారు. అర్హులందరూ నమోదు చేయించుకోవాలని కోరారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ వివిధ లోపాలు గల వయోవృద్ధులకు ఇది ఒక మహత్తర కార్యక్రమమని ప్రశంసించారు. 2017లో ప్రారంభించిన ఈ పథకం జీవీఎల్ సహకారంతో తిరిగి ప్రారంభమైందని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జె.మాధవి, కార్యక్రమ కో ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, ఆలిమ్‌కో ప్రతినిధులు అంకిత్, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్, 'ఉత్తర' సమన్వయకర్తలు బొత్స ఝాన్సీ, కె.కె.రాజు
- 46వ వార్డులో ఎన్నికల ప్రచారం


46వ వార్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న బొత్స ఝాన్సీ, కె.కె.రాజు


వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ, కె.కె.రాజు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా.. క్షేమంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 46వ వార్డులో డిప్యూటీ మేయర్, పార్టీ మండల ఇన్‌చార్జి కటుమూరి సతీష్ నేతృత్వంలో ఆదివారం వారు ఎన్నికల ప్రచారం ఘనంగా ప్రారంభించారు. మధుసూదన్‌నగర్, కస్తూరినగర్, శాంతినగర్ కొండవాలు ప్రాంతాల్లో మహిళలు వారికి బ్రహ్మరథం పట్టారు. ప్రతి ఇంటి వద్ద హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ, కె.కె.రాజులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పేద, మధ్యతరగతి ప్రజల ఇబ్బందులు తొలగాయన్నారు. రాష్ట్రంలో ఇదే వైభవం కొనసాగాలంటే మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచి జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుదామని పిలుపునిచ్చారు.

ఎన్నికల ప్రచారానికి ముందుగా 49వ వార్డు కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామిని బొత్స ఝాన్సీ, కె.కె.రాజులు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద మీడియాతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ననపల చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే రెహ్మాన్, పార్టీ రాష్ట్ర నాయకులు రొంగళి జగన్నాథం, రవిరాజు, కాశీ విశ్వనాథం, భరణికాన రామారావు, నరసింహమూర్తి, భారతి, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీను, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, కార్పొరేటర్లు రజిని, కె.కామేశ్వరి, కె.అనిల్‌కుమార్‌రాజు, ఎస్.పద్మారెడ్డి, లీలావతి, పి.ఉష, వి.ప్రసాద్, శశికళ, నాయకులు అప్పారావు, అనూష, పట్నాయక్, సుజాత, రమణికుమారి, కిరణ్‌రాజు, ద్రోణంరాజు శ్రీవత్సవ్, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింప జేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడ సేవ ఘనంగా జరిగింది. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి అష్టోత్తర శతనామవళి పూజ చేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామికి హారతులు అందజేశారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో సాయిదుర్గా హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం చేనేత వస్త్ర, హస్తకళ ప్రదర్శన ప్రారంభమైంది. నిర్వాహకులు మాట్లాడుతూ సెక్టార్–5లోని గిరిజన భవన్‌లో ఈ నెల 22 వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రవేశం ఉంటుందన్నారు. ఏపీతోపాటు పశ్చిమబెంగాల్, కర్నాటక, రాజస్థాన్ న్యూఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన చేనేత ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు చెప్పారు. పోచంపల్లి, నారాయణ్‌పేట్, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, బెంగాల్ సిల్క్, బాంధిని సిల్క్, భాగల్‌పూర్ సిల్క్ చీరలు, కాటన్ టవల్స్, బెడ్‌షీట్స్, డోర్ కర్టన్స్, మ్యాట్స్‌ను, హస్తకళతో కూడిన గృహోపకరణాలను, ఫ్యాన్సీ ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

వృక్షశాస్త్ర విభాగాధిపతిగా సంధ్యాదీపిక

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య పి.సంధ్యాదీపిక పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం విభాగంలో బాధ్యతల్లో చేరారు. ఆమెను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

రాజ్యాంగంపై వ్యతిరేకత తగదు

సీతంపేట: భారత రాజ్యాంగంపై వ్యతిరేకత తగదని రచయిత గుంటూరు లక్ష్మీ నరసయ్య అన్నారు. భీమ్‌సేన వారి ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'భారత రాజ్యాంగంపై అవగాహన, ఉద్దేశపూర్వక వక్రీకరణలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తే కుల నిర్మూలన పోరాటాలను వ్యతిరేకించినట్టేనన్నారు. రాజ్యాంగంపై విప్లవ కమ్యూనిస్టులు చేస్తున్న విమర్శలు అర్థరహితమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలు విద్యా, ఉద్యోగ పరంగా అభివృద్ధి సాధిస్తున్నారంటే దానికి రాజ్యాంగమే కారణమన్నారు. ప్రొఫెసర్ పి.డి.సత్యపాల్ మాట్లాడుతూ విజయవాడలో స్థాపించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ స్మృతి వనంలో అనేక చారిత్రక విషయాలు ఉన్నాయన్నారు. అంబేడ్కర్ కృషి ఫొటోల రూపంలో విజయవాడ మ్యూజియంలో పొందుపర్చారని తెలిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం పుష్య మాస శుద్ధ అష్టమి సందర్భంగా ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతోపాటు రూ.10, రూ.50 దర్శనాలు కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటావార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.